# నాగరికత

మనిషి నిప్పు నేర్చుకున్నాడు.

నెగడు వేసుకున్నాడు.

వెలుగునూ, వేడిమినీ పట్టి పెట్టుకోవాలని

మాత్రం అనుకోలేదు.

మనిషి చారెడు చమురు తెచ్చుకున్నాడు.

ప్రమిదలో పోశాడు.

గుడ్డుక్కను తాల్చి వత్తి చేశాడు.

నానా ప్రయాస పడి ఆ వత్తిని వెలిగించాడు.

అది వెలిగింది.

చీకటి మాత్రం తొలగ లేదు.

ఆ చీకటి వెలుగులోనే మనిషి బతుకును కొలిచాడు.

దీపం కొడి గట్టింది.

కొండెక్కింది.

మరుసటినాడు మనిషి, దీపానికి మరింత చమురు చేర్చాడు.

వత్తి చివర కొడిని ఒత్తి నలిపేశాడు.

వత్తిని పైకి తోశాడు.

మళ్లీ ప్రయాస. మళ్లీ వెలుగో చీకటో తెలియని వెలుగు.

దీపం గూట్లో పైన మసి, కింద మైనం కూడుకుంటున్నాయి.

అప్పుడు నాగరికత నడిచి వచ్చింది.

ఇది చీకటోయ్ అంది.

తట్టల నిండా ట్టి నూనె పట్టి తెచ్చింది.

మనిషి వెలుగొచ్చిందనుకున్నాడు.

చారెడు ప్రమిద దోసెడయింది.

వేలంత లావు వత్తి వచ్చింది.

గీస్తే వెలిగే అగ్గిపుల్ల వచ్చింది.

వత్తి ఒకటేకాదు. ప్రమిద ప్రమిదంతా వెలిగింది.

వెలుగో వెలుగు.

వెలుగూ వేడీ గోడలకు పాకి,

గుడిసె గుడిసెంతా వెలిగింది.

వెలుగు వెలుగు వెలుగో వెలుగు

చేసేది లేక మనిషి డప్పు తీసుకు

వెలిగే గుడిసె ముందు తారంగం ఆడాడు.

తాండవం చేశాడు. వీరంగమాడాడు.

గుడిసె చప్పున చల్లారి పోయింది.

మర్నాడు బూడిదమీద వాన కురిసింది.

ఈసారి నాగరికత మళ్లీ వచ్చింది.

బుడ్డీదీపం కందిలీ ఒత్తులపొయ్యి తెచ్చింది.

మనిషి అదే వెలుగనుకున్నాడు.

అది బాగానే ఉందనుకున్నాడు.

వంటలూ వాసనలూ మంటలూ కంపులూ కలగలిసి పోతున్నాయి.

మరోసారి నాగరికత మళ్లీ వచ్చింది.

అంతదూరం నుంచే వెలుగును వెల్లువగా

వెదజల్లుతూ వచ్చింది.

చేరువకు వచ్చి వెచ్చదనాన్ని పంచింది.

చేతనయినంత చల్లదనాన్ని పంచింది.

ప్రపంచాన్ని మీటలుగా మార్చింది.

బతుకును పాటలుగా మార్చింది.

పంటపొలానికి పంపు ఇక ◌ోటలు లేవు.

వంటయింట్లో సొంపు

ఇక పొగలు పొయ్యిలు లేవు.

అటు పాట యిటు ఆట

చీకటింట్లో వెలుగుబొమ్మల సయ్యాట.

పుస్తకం అక్కరలేదు.
మస్తకం అక్కరలేదు.
మీటలుంటే చాలు
నట్టింట్లోకి నవప్రపంచం నడిచొచ్చి నిలబడుతుంది.
నిలబడ్డ మనిషి నిలబడ్డట్లే
నేల నాలుగు చెరుగులా తిరిగొస్తాడు.
మనిషికి ఇప్పుడు చీకటి జ్ఞాపకం లేదు.
చెమటవాసన గుర్తులేదు.
నాకు మించినవాడెవడంటూ మనిషి
నానా పోకడలు పోసాగాడు.
అందరి ఆటలు కట్టించే మీటను
తయారుచేసి సీటుకింద పెట్టుకున్నాడు.
విర్రవీగిపోతున్నాడు.
వికటాట్టహాసం చేస్తున్నాడు.
బయట ప్రపంచం మాత్రం వేడెక్కి మాడిపోసాగింది.
చీకటి మళ్లీ నలుదెసలా నడయాడసాగింది.
మీటల మనిషి మాత్రం మాటిమమాటికీ విజయచిహ్నాలు
చూపుతూనే ఉన్నాడు
చీకటి మనిషి చీకట్లోనే ఉన్నాడు.

అంతలో అక్కడెక్కడో
మీటలను కలిపే తీగల్లో
ఆ తీగలను కలిపే తీగల్లో అదేదో
కదిలి జారిపోయింది.
ఇంకేమముందీ
జగము చీకటాయెనే
బతుకు భారమాయెనే

మనిషి చెమటలు కక్కుతున్నాడు.

ఎండలో మంచుకొండలను మైమరిపించే మీటలు
అప్పుడిక మాటలు వినవుగదా మరి
మనిషి చీకట్లో తచ్చాడుతున్నాడు.
తట్టుకు పడుతున్నాడు.
వేడికి మైనంవత్తి వంగి పక్కకు వాలిపోతున్నది.
మట్టినూనెను మనిషి ముట్టుకోలేదని
అది మట్టి మనుషులను వెతుక్కుంటూ వెళ్లిపోయింది.
చమురాముదం సంగతి బాలెంతరాళ్లకు కూడా
తెలియక అది పాత పుస్తకాల్లోకి పారిపోయింది.
మనిషికి గొంతెండుకు పోతున్నది.
చెమటలు కూడా రావడంలేదు.
తట్టు తగిలిన కాలిపోటు తలకెక్కుతున్నది.
అతను ఎలుగెత్తి కేకలు పెడుతున్నాడు.
ఏయ్ నాగరికతా ఎక్కడున్నావ్
ఇప్పుడు నా సంగతేమిటి
అదేపనిగా అరుస్తున్నాడు.
నాగరికత కుర్చీలకింద నక్కి కూచున్నది.
కుర్చీలోని మారాజు
మీటల మంత్రినిపిలిచి నానా మాటలన్నారు..
మీటలంటే మాటలా అవి వోట్లు కత్తిపోట్లు
అని శెలవిచ్చారు.
మనిషి మాత్రం దారేమిటో తెలియక
తచ్చాడుతూనే ఉన్నాడు.
నాగరికత నక్కిన చోటినుంచి
బిక్కచూపులు చూస్తున్నది.

**కె.బి గోపాలం**